క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ : పెద్దకడబూరుకు చెందిన కాళింగప్ప, మేరమ్మ అనే దంపతులు మోటార్ బైకుపై అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం బలదూరు క్రాస్ రోడ్డు వద్ద రెండు 90 ఎం.ఎల్.పరిణామం బాక్సులు, ఒక 180 ఎం.ఎల్. బాక్సులను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

వేద పాఠశాల ప్రారంభం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని తుంగభద్ర గ్రామంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రైతు వేద పాఠశాలను ఎల్‌జీఏ డైరెక్టర్ డానియేల్ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు వాడటం మూలంగా భూ సారం తగ్గి దిగుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఆదోని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, కర్నూల్‌లోని ఆర్సీఎం బీసఫ్ అంథోనప్ప చౌరప్ప, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోషువాపీటర్, డైరెక్టర్ సామేల్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని రూరల్ : మండలంలోని నాగలాపురం గ్రామానికి గొల్ల అడివప్ప, కురువ ఈరన్న అనే ఇద్దరు వ్యక్తులు మంగళవారం సాయంత్రం ఆదోని నుంచి నాగలాపురంకు బైకుపై వెళ్తుండగా అదుపు తప్పి కింద పడ్డారు. అయితే క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తామే స్వయంగా బైక్ స్కిడ్ కావడంతో కింద పడినట్లు చెప్పారని తాలూకా ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి కేసు నమోదు చేయవద్దని క్షతగాత్రులు కోరారన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

ఆదోని రూరల్ : మండలంలోని మండిగిరి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా పాఠశాల వార్షిత్సవ వేడుకలు, సరస్వతీ పూజ కార్యక్రమాలను హెచ్‌ఎం బి.మహాదేవప్ప ఆధ్వర్యంలో న్విహించారు. సరస్వతీ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, ప్రభాకర్, శేషాద్రి రెడ్డి, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

కౌతాళం: ప్రతి విద్యార్థికి చిన్న తనం నుంచే సేవాగుణం పెంపొందేలా తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కౌతాళం గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్ అన్నారు. మండల కేంద్రమైన కౌతాళం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆదోని భీమా ఎంబీఏ కళాశాల విద్యార్థులు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు.

బహిరంగ మూత్రవిసర్జన చేయొద్దు

ఆదోని టౌన్: పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగా మూత్ర విసర్జన చేయరాదని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. బహిరంగ మలమూత్ర విసర్జన ద్వారా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. జీబీ కాంప్లెక్స్ వద్ద ఖాళీ స్థలంలో కొన్నేళ్ల నుంచి స్థానికులతో పాటు ఇతరులు బహిరంగ విసర్జన చేసేవారు. తద్వారా ఆ ఏరియా దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆ ప్రాంతాన్ని మంగళవారం కమిషనర్ పరిశీలించారు. ఇకమీదట ఈ ప్రాంతంలో విసర్జన చేయరాదన్నారు. అలా చేసినట్లయితే జరిమానాలు విధిస్తామన్నారు. స్థలం యజమానితో చర్చించారు. ఖాళీగా స్థలాన్ని ఉంచరాదని, కంచె ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా కాంపోస్టు యార్డును ఆయన తనిఖీ చేశారు. కాంపోస్టు యార్డులో జరుగుతున్న ప్రహరీ నిర్మాణం పనులను పరిశీలించారు. ఈయన వెంట టీపీఓ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, హరినాథ్, మేస్త్రీలు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న నాయకులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని కొండుగానీ వీధి లో తాగునీటి పైప్‌లైన్ వేసి తాగునీటి సరఫరా చేసి సమస్యకు పరిష్కారం చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ ఆధ్వర్యంలో కాలనీలో తాగునీటి కులాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ నిధులు రూ.3లక్షలతో కాలనీలోకి కొత్తగా పైప్‌లైన్ వేసి పలు ఇళ్ల వద్ద పబ్లిక్ కులాయిలు ఏర్పాటు చేయించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, మాణిక్యరాజు, మంగమ్మ, బుల్లి నరసింహులు, రాజేష్, కాంట్రాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ చదవాలి

ఆదోని అర్బన్ : ప్రతిఒక్కరూ చదువాలని, అప్పుడే ఆ కుటుంబం అభివృద్ధి బాట పడుతుందని ఎంఈఓ శివరాములు అన్నారు. మంగళవారం స్థానిక న్యూచైతన్య కాలనీలో ఉన్న వాగ్దేవి పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



50 పడకల స్త్రీల, చిన్నారుల ఆస్పత్రి భవనం



వేగవంతంగా జరుగుతున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు (ఫైల్)



అందంగా రూపుదిద్దుకున్న జిమ్ రోడ్డు

అభివృద్ధి పరుగులు!

- పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి రూ. కోట్లు వెచ్చించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- రూ.7 కోట్లతో ప్రభుత్వ ఐటీఐ కళాశాల నిర్మాణం పూర్తి
- మెడికల్ కళాశాల మంజూరు.. రూ.475 కోట్లతో చురుగ్గా సాగుతున్న పనులు
- ఊళ్లను తలపిస్తున్న జగనన్న కాలనీలు



జగనన్న కాలనీలో చురుగ్గా సాగుతున్న గృహ నిర్మాణ పనులు



జగనన్న కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, అధికారులు (ఫైల్)



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

ఆదోని టౌన్ : జిల్లా పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తుంది. ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆదోని నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యతినిస్తూ రూ. కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేకించి ఏళ్లతరబడి పట్టించుకోని రోడ్లు నేడు తలతలాడుతున్నాయి. పట్టణాలతోపాటు గ్రామాల్లో సీసీ రోడ్లు మెరుస్తున్నాయి. ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి చొరవతో ఆదోని అన్నివిధాలా అభివృద్ధి చెందుతుంది.

ఆదోనికి మెడికల్ కళాశాల మంజూరు

రాష్ట్రానికి శివారు, కర్ణాటక ప్రాంతం సరిహద్దు మూఢాచారాలతో అత్యంత వెనకబడిన ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు ప్రాంతాల ప్రజలు కనీసం వైద్య సదుపాయం పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. ఏ జబ్బు చేసినా కర్నూలు, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, బళ్లారి ప్రాంతాలు వ్యయ ప్రయాసలతో వెళ్లేవారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఆదోనికి మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. ఆదోని మండలంలోని బైచిగేరి–నాగలాపురం మధ్య 58.44 ఎకరాల విస్తీర్ణంలో కళాశాలను నిర్మించనున్నారు. నాడు–నేడు పథకం కింద రూ.475 కోట్లతో కాలేజీ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం కళాశాల నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఆదోనికి పదుల సంఖ్యలో వివిధ రకాల వైద్య నిపుణులు నియమించబడతారు.

రూ.7 కోట్లతో ఐటీఐ కళాశాల

ఆదోని మండల పరిధిలోని విరుపాపురం–సాదాపురం మధ్య రూ.7 కోట్లతో ప్రభుత్వ ఐటీఐ కళాశాల నిర్మాణం పూర్తి చేశారు. త్వరలోనే ప్రారంభం కానుంది. ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆదోనిలో ఉన్నప్పటికీ సొంత భవనం లేక చిన్నపాటి వర్షం కురిసినా కారడంతో రికార్డులన్నీ తడిచిపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు కూర్చొనేందుకు స్థలం లేక చాలా ఇబ్బందులు పడేవారు. ఇబ్బందులను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.7 కోట్లను మంజూరు చేయించారు. ఈ మేరకు విరుపాపురం వద్ద చేపట్టిన సొంత భవనం నిర్మాణం పూర్తయింది.

రూ.30 కోట్లతో జగనన్న కాలనీల్లో పక్కా ఇళ్లు

మండిగిరి లేఅవుట్‌లో దాదాపు రూ.30 కోట్లతో హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో పక్కా ఇళ్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. నవరత్నాలు–అందరికీ ఇల్లు పథకంలో భాగంగా మండిగిరి లేఅవుట్‌లో ఇల్లు లేని పేదలు దాదాపు 10,200 మందికి ఇంటి స్థలాలు పంపిణీ చేసి పక్కా ఇల్లు మంజూరు చేశారు. పేదలు నిర్మించుకునేందుకు స్థోమత లేక పోవడంతో ప్రభుత్వమే థర్డ్ పార్టీ ద్వారా నిర్మించి ఇస్తోంది. ప్రస్తుతం 5,100 గృహాలు నిర్మాణంలో ఉన్నాయి. అందులో రూ.30 కోట్లతో వెయ్యి గృహాల పనులు చురుగ్గా సాగుతున్నాయి. లెంటల్ లెవెల్, రూఫ్ లెవెల్‌తో పాటు కొన్ని ఇళ్లు పూర్తి అయ్యాయి. మిగిలిన 4 వేల ఇళ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. జగనన్న కాలనీలు ఊళ్లను తలపిస్తున్నాయి. రూ.9 కోట్లతో రోడ్ల ఏర్పాటు, రూ.7.50 కోట్లతో తాగునీటి వసతి, రూ. 20 లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను ఏర్పాటు చేశారు. మురుగు కాలువల పనులు జరుగుతున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నూతన భవనాలు

పట్టణంలో రోగులకు అనుగుణంగా ప్రభుత్వాసుపత్రుల్లో మరో రెండు భవనాలు నిర్మితమవుతున్నాయి. అత్యాధునిక వసతులతో భవనాలను నిర్మిస్తున్నారు. ఒక్కొక్క భవనానికి రూ.10 కోట్లు నిధులు మంజూరు చేసింది ప్రభుత్వం. నాడు–నేడు పథకం కింద నిధులను సమకూర్చారు. ఏరియా ఆస్పత్రిలో వంద పడకల నూతన భవనం, స్త్రీల, పిల్లల ఆస్పత్రిలో 50 పడకలు భవనంను పూర్తి చేశారు. త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి వివారాలు మరికొన్ని....

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాతనే ఆదోని అన్నివిధాలా అభివృద్ధి చెందుతుంది. కోట్లాది రూపాయలతో వాడవాడలా కల్వర్టులు, సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు, అత్యాధునిక ఎల్ఈడీ వీధిలైట్లు ఏర్పాటు చేశారు.

- 2019–20లో 14వ ఆర్థిక సంఘం కింద రూ.1.99 కోట్లతో 65 అభివృద్ధి పనులు చేశారు. కల్వర్టులు, రోడ్లు కాలువలు, పైపులైన్లు తదితర అభివృద్ధి పనులు
- 2021–22లో రూ.50 లక్షలతో ఒక పని పూర్తి చేశారు.
- 2020–21లో 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.6.70 కోట్లతో 34 అభివృద్ధి పనులను చేపట్టారు. రెండో విడత కింద రూ.9,92,43,000 24 పనులను పూర్తి చేశారు.
- వైఎస్సార్ కాన్సెంటెన్సీ పథకం కింద 2020–21లో రూ.1.60 కోట్లతో రెండు అభివృద్ధి పనులను పూర్తి చేశారు.
- 2021–22లో వైఎస్సార్ అర్బన్ కాన్సెటెన్సీ కింద రూ.40 లక్షలతో నాలుగు పనులను చేశారు.
- 2022–23లో జీజీఎంపీ ఫండ్స్ కింద రూ.2.20 కోట్లతో 28 అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.
- 2022–23లో సీఎండీఎఫ్ పథకం కింద రూ.15 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి.
- 2022–23లో సీఎం హామీ కింద రూ.5.30 కోట్లతో రెండు పనులు, అదేవిధంగా 2018 నుంచి ఎస్ఏసీ పథకం కింద రూ.2.50 కోట్లతో పనులు పూర్తి చేశారు.
- జనరల్ ఫండ్స్ కింద 2021–23 వరకు రూ.6.8 కోట్లతో 56 పనులు, 2019–20లో రూ.2 కోట్లతో 85 పనులను పూర్తి అయ్యాయి.
- ఆదోని మండలం మదిరె, చిన్నహరివాణం, సంతెకూడ్లూరు గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మదిరె వద్ద కొత్తగా ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం పనులు రూ.10 కోట్లతో జరుగుతున్నాయి.
- పట్టణంలో శివారు ప్రాంతాల్లో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు సకాలంలో వైద్యం అందించాలన్న ఉద్దేశంతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించి ప్రారంభించారు. రూ.20 లక్షలతో ఈ సెంటర్‌లను పూర్తి చేశారు. ప్రస్తుతం పేదలకు వైద్యసేవలను అందిస్తోంది. పట్టణంలో సబ్‌రిజిస్టర్ కార్యాలయం వద్ద కొత్తగా మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి



ఆదోని నియోజకవర్గంలో కోట్లాది రూపాలతో అభివృద్ధి పనులు చేశాం. పట్టణంలో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం. ఆస్పరి–ఆలూరు రోడ్డులో ఆగిపోయిన బైపాస్ రోడ్డు నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తాం. గత టీడీపీ హయాంలో ఆదోనిలో జరిగిన అభివృద్ధి అంటూ ఏమీ లేదు. తాను ఎమ్మెల్యేగాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశాం. ముఖ్యంగా మెడికల్ కళాశాల, జగనన్న కాలనీ ఏర్పాటుతో ఆదోని రూపురేఖలు మారిపోనున్నాయి. పట్టణంతో పాటు గ్రామాల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటున్నాం.

– ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

బాబు హామీలు గుర్తున్నాయా...చిన్నబాబు!

- వాల్మీకులను నమ్మించి మోసం చేసిన చంద్రన్న
- బనవాసి వద్ద టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు ఎక్కడ ?
- ఆలూరు–ఆదోని మధ్యలో జింకల పార్కు ఏర్పాటు ఏమయ్యింది బాబు?
- 21వ తేదీ నుంచి లోకేష్ పర్యటన!
- దీంతో మొదలైన చర్చ?

ఆదోని టౌన్ : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన హయాంలో ఎన్నో హామీలు గుప్పించారు. ప్రతిసారీ నాకు తెలుసు అంటూనే హామీలతోనే మభ్యపెట్టారనే విమర్శలు లేకపోలేదు. ఈ ప్రాంతానికి బాబు హయాంలో ఇచ్చిన హామీలు నెరవేర్చని వైనం.. ప్రస్తుతం అభివృద్ధి పరుగులు తీస్తున్న నేపథ్యంలో ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఆదోని నియోజకవర్గంలో నారా లోకేష్ యువగళం పాదయాత్ర జరుగనుంది. ఈ నేపథ్యంలో ప్రజల్లో చర్చ మొదలైంది. ప్రత్యేకించి ఎస్టీ జాబితా పేరుతో వాల్మీకులను నమ్మించి మోసం చేశారని, తమను కరివేపాకులా వాడుకుని వదిలేశారని ఆ సామాజిక వర్గం భగ్గుమంటూంది కూడా. ఆదోని–ఎమ్మిగనూరు మధ్యలో బనవాసి ఫారం వద్ద టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తానని చెప్పిన చంద్రబాబునాయుడు పదేళ్లయినా ఇంతవరకు అతిగతి లేకుండా పోయింది. ఆలూరు–ఆదోని ప్రాంతాల్లో జింకల బెడద నుంచి రైతులను కాపాడేందుకుగానూ జింకల పార్కు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి ఐదేళ్లు దాటిపోయింది. తండ్రి ఇచ్చిన హామీలు తనయుడు చిన్నబాబుకు తెలిసి ఉంటుందా... అంత చైతన్యం చిన్నబాబులో ఉందా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు నియోజకవర్గ ప్రజలు. ఏది ఏమైనా తన తండ్రి ఇచ్చిన హామీలపై ఏమి చెబుతారనే ఆసక్తి నెలకొంది. తండ్రి హామీలపై సరైన సమాధానం ఇస్తారా... లేక దాటవేస్తారా అన్నది వేచి చూడాలి మరి.

జగనన్న తపన అభినందనీయం



సీఎం జగన్ ఫొటోను చూపుతున్న ఓ వృద్ధురాలు

కౌతాళం : పేదల సంక్షేమం కోసం సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పడుతున్న తపన అభినందనీయమని వై. ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. ×గడప గడపకు మన ప్రభుత్వం× కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు మంగళవారం మండల పరిధిలోని కుంటనహాల్ గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో 250 ఇళ్లను సందర్శించారు. మూడన్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకించి వృద్ధులతో ముచ్చటించారు. పింఛన్ ఇంటి వద్దకే వస్తుందా... లేదా.. అని ఆరా తీశారు. జగన్‌బాబు పుణ్యమా అని పింఛన్ ఠంచన్‌గా అందుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలన్న ఉద్దేశంతోనే జగనన్న అత్యధిక ప్రాధాన్యత సంక్షేమానికి ఇస్తున్నారన్నారు. పేదల జీవితానికి భరోసా ఇవ్వడంలో ఆయనకు ఉన్న స్పష్టత ఎవ్వరికీ లేదన్నారు. పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకునేలా పాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. రైతుల కోసం రైతు భరోసా, పంట బీమా, నష్ట పరిహారం పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, విద్యా కానుక, తదితర పథకాలు పేదలకు వరంగా మారాయన్నారు. సచివాలయం వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజల దరికి పాలన తీసుకువచ్చారని చెప్పారు. గ్రామంలో 1.50కోట్లతో తాగునీటి కోసం ట్యాంకుతో పాటు పైప్‌లైన్ కోసం నిధులు మంజూరు చేయించామని, ఆపనులు పూర్తి అయితే తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. అలాగే నాడు–నేడుతో నూతన పాఠశాల భవనంతో పాటు పాఠశాల మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉందని దీనిని వెంటనే పరిష్కారించాలని పలువురు ఫిర్యాదు చేశారు. సిమెంటు రోడ్లు చేయాలని కోరారు. అనంతరం జామియ మసీదుకు వెళ్లి కబ్రస్తాన్ వద్ద ఉన్న రహదారి సమస్యపై చర్చించారు.కార్యక్రమంలో ఎంపీపీ అమరేష్, వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, గ్రామ సర్పంచ్ పార్వతమ్మ, గ్రామ ఇన్‌చార్జ్ శివరాం, నాయకులు ఏకాంబర్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రహాల్లదచారి, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, ఎరిగేరి సర్పంచ్ గోవిందు, నాయకులు రాఘవేంద్రరెడ్డి, హాల్వి చెన్నప్పధని, గురునాథ్‌రెడ్డి, వడ్డెరాము, నర్సిములు, తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ జగన్ మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ రాజశేఖర్, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ఆదోని అర్బన్ : ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) మహిళా విభాగ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విశ్వ హిందూ పరిషత్ కార్యాలయం ఎదుట మహిళా విభాగ్ చైర్మన్ ఆరవేటి నిర్మల జన్మదిన సందర్భంగా ప్రజలకు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. ఈ చల్లని మజ్జిగ ఎంతోమంది బాటసారుల దాహార్తి తీర్చి ఎండకు ఉపశమనం కలిగించిందని అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్, రఘు, ఆవోపా మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శి, కోశాధికారులు సంగీత, మమతాశ్రీ, హిమబిందు, ఈసీ మెంబర్స్ ఈరన్న, కౌశిక్, రాజగోపాల్, రాఘవేంద్ర, గీత, శోభ, సంధ్య, యశోద, లావణ్య, ముక్త, రాజేశ్వరి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి అండర్ రోడ్డుకు స్థల పరిశీలన



రైల్వే బ్రిడ్జ్ అండర్ రోడ్డుకు భూసేకరణ స్థల పరిశీలన చేస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్

మంత్రాలయం: రైల్వే బ్రిడ్జి అండర్ రోడ్డు ఏర్పాటుకు భూసేకరించేందుకు ఆ ప్రాంతాన్ని మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. పెద్దకడబూరు మండలం గవిగట్టు గ్రామాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి రైల్వే అధికారులు, రెవెన్యూ, సర్వేయర్‌తో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం స్థల సేకరణ నివేదికలు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అనంతరం గ్రామంలో భూములు రీసర్వే పూర్తి చేసి త్వరితగతిన సరిహద్దు రాళ్లు పాతించాలన్నారు. సర్వే పూర్తి చేసుకున్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. రైతులు ఇందుకు స్పందిస్తు ప్రభుత్వం తీసుకున్న ఈనిర్ణయం చాలా బాగుందన్నారు. గతంలో సరిహద్దులు సరిగ్గా లేక ఇబ్బందులు పడేవాళ్లమని, ప్రస్తుత రాళ్లు పాతించడం చాలా సంతోషకరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

వ్యవసాయేతర భూములకు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

వ్యవసాయేతర భూములుగా మార్చుకొనుటకు ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పక పాటించాలని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలో వ్యవసాయేతర భూమిగా మార్పునకు దరఖాస్తు చేసుకోగా ఆ భూమిని మంగళవారం ఆయన పరిశీలించారు. మార్కెట్ విలువతో 5శాతం ప్రభుత్వ చలానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించక పోతే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరేంద్ర గౌడ, రైల్వే డిప్యూటీ ఇంజినీర్ రమణ, రీసర్వే ఉప తహసీల్దార్ మహేష్, సర్వేయర్ తేజశ్విని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మద్దతుదారులు



ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాగలాపురం ప్రజలు

ఆదోని టౌన్: ఆదోని మండలం నాగలాపురం గ్రామానికి చెందిన పది కుటుంబాల ప్రజలు మంగళవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో చేరారు. టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీకి చేరేందుకు వచ్చిన నాగలాపురం గ్రామానికి చెందిన ప్రజలకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ గ్రామప్రజలు దినేష్, నరసప్ప, సూగూరప్ప, వీరేష్, వీరనాగప్ప, సిద్దయ్య, లోకేష్, రాముడు, రామాంజనేయులు, నాగిరెడ్డి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటూ పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే సాయన్న వెంట నడవాలనే ఉద్దేశంతో పార్టీలో చేరడం జరిగిందన్నారు. తమను నమ్ముకొని పార్టీలో చేరిన నాగలాపురంవాసులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. పార్టీకోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం



మండిగిరిలోని తిరుమలనగర్‌లో ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న శేషిరెడ్డి

ఆదోని రూరల్ : సీఎం వైఎస్ జగనన్నతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కల్లుపోతుల సురేష్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని మేజర్ పంచాయతీ మండిగిరిలోని తిరుమలనగర్, బాబాగార్డెన్, మాణిక్యరెడ్డినగర్, విజయ్ ఎస్టేట్ కాలనీల్లో ×జగనన్నే మా భవిష్యత్× కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం మూడేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాలన తీరుపై ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఆయా కుటుంబాల యాజమాన్యాల అనుమతితో వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్న స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజశేఖర్‌రెడ్డి, వీరేష్, వినోద్‌రెడ్డి, చిన్నాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: మండల కేంద్రం మంత్రాలయంలోని రాఘవేంద్రనగర్, రామచంద్రనగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయసలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్‌శెట్టి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాల యాజమాన్యాల అనుమతితో వారి ఇళ్లకు మా నమ్మకం జగనన్నే స్టికర్లు అతికించారు.